క్లుప్తంగా

చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ శాఖ ఏసీ సుధాకర్

పామిడి: నూతన ప్యాకేజీ చట్టాలకు అనుగుణంగా మిల్లులు, షాపుల నిర్వాహకులు నడుచుకోవాలని లీగల్ మెట్రాలజీ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ ఆదేశించారు. పామిడి-కల్లూరు ఏరియాలకు సంబంధించి బియ్యం మిల్లులు, ఎరువుల షాపుల నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూనికలు, కొలతలు, ప్యాకేజీ వస్తువులు, వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు శంకర్, గౌస్, జిల్లా బియ్యం మిల్లుల సంఘం అధ్యక్షుడు పోతురాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సువార్త సభలు

పామిడి: పట్టణంలోని క్రీస్తు కల్వరి పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో బుధవారం, గురువారం సాయంత్రం 6 గంటలకు కల్లూరు గ్రామ సత్యసాయి ట్యాంక్ ఏరియాలో ఉజ్జీవ రక్షణ సువార్త సభలు నిర్వహించనున్నట్లు ఆ పరిచర్య పాస్టర్ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. సువార్త సభలకు ముఖ్య ప్రసంగీకులుగా బిషప్ శ్యామ్‌సుందర్ హాజరవుతారన్నారు. తద్వారా ఈ సభల్లో క్రైస్తవ విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొని క్రీస్తు ఆశీర్వాదాన్ని పొందాలని ఆయన కోరారు.

అలరించిన పద్యాలు



పద్యాలు ఆలపిస్తున్న ఈఓ రాముడు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం కళాకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయంలో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా పట్టణానికి చెందిన పలువురు కళాకారులు ఈఓ రాముడు, రంగారెడ్డి, సుధాకర్ పాల్గొని పౌరాణిక పద్యాలు, భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం చిత్రకారుడు శ్రీధరన్ చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు కళ్యాణ్ చేత తెలుగు వ్యాకరణం, చదవడం, రాయడం గురించి నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమ్మన్న, సిబ్బంది హేమలత, రాము తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయం-2లో పరిధిలోని అంగన్ వాడీ కేంద్రంలో బాలల హక్కులు-మన బాధ్యత, బాలల భవిష్యత్ రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీస్ షేక్ రజియాబేగం మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి బాలికలను కాపాడుకు నేందుకు భారత ప్రభుత్వం పోక్సో చట్టం ప్రవేశ పెట్టిందన్నారు. బాలికలపై లైంగిక దాడులు జరిగితే కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. అలాగే చిన్నారుల భద్రతల కోసం 1098 చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



మురళి నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం వీరా జవాన్ మురళి నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ జవాన్ మురళి నాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బసెట్టి క్రిష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, కృష్ణానంద, వెంకటసుబ్బయ్య, సుభాషిణ, సువర్ణ, అమీర్, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కసాపురం రమేష్

గుంతకల్లు రూరల్: డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కసాపురం రమేష్‌ను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం పట్టణంలో మంగళవారం డీవైఎఫ్‌ఐ 14వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కసాపురం రమేష్‌తోపాటు మరో 24 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యాహక్కు చట్టం అభాసుపాలు!



- ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు నోచుకోని పేద విద్యార్థులు
- రేపటితో ముగియనున్న గడువు
- ప్రచారం చేయని విద్యాశాఖ



మండల విద్యాశాఖ కార్యాలయం

తాడిపత్రి రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే విద్యాహక్కు చట్టం -2009ను విద్యాశాఖ అధికారులు అభాసుపాలు చేస్తున్నారు. తాడిపత్రి పట్టణంతోపాటు తాడిపత్రిరూరల్, పెద్దపప్పూరు, యాడికి, పెద్దపప్పూరు మండల కేంద్రాల్లో వందకు పైగా ప్రైవేట్ పాఠశాలలున్నా ఉచిత సీట్లపై నిబంధనలను పాటించడం లేదు. కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో విద్యాశాఖ అధికారులు కుమ్మక్కై ప్రచారాన్ని మూలన పడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కూడా నామమాత్రంగా ఉత్తర్వులు జారీ చేసి పరోక్షంగా ప్రైవేట్ పాఠశాలలకు దన్నుగా నిలుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు గాలికి..

ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో పేద పిల్లలకు ఉచిత విద్య అందిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1)లో 25శాతం ఉచితంగా సీట్లను కేటాయించాలి. ఉచిత సీట్లపై గ్రామ, మండల స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వ ఉత్తర్యులు ఉన్నాయి. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని, ఫేక్‌బుక్, ట్విట్టర్, ఎక్స్, యూట్యూబ్, లోకల్ మీడియాల్లో ప్రచారం చేయాలన్న ఆదేశాలు ఉన్నాయి. విద్యాశాఖ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, సచివాలయాల వద్ద పోస్టర్లు అతికించడం, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిపించడానికి మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలి. కానీ వాటిలో ఒకటి, రెండు కూడా అమలు చేయడం లేదు.

అర్హతలు ఇవే..

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పొందడానికి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితులు మైనార్టీలు అర్హులని ప్రభుత్వ ఉత్తర్వులు పేర్కొంటున్నాయి. వీరిలో దివ్యాంగులు, హెచ్ఐవీ, అనాథలకు 5 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, ఓసీ, బీసీ, మైనార్టీలకు 6శాతం సీట్లను రిజర్వు చేశారు. గ్రామీణుల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.44 లక్షల్లోపు ఉండాలి.అలాగే 2019 ఏప్రిల్ 2నుంచి 2020 మార్చి 31లోపు జన్మించిన వారు మాత్రమే అర్హులు. అయితే ప్రభుత్వ నిబంధనలు గ్రామీణ విద్యార్థులకు శాపంగా పరిణమించాయి. నిబంధనల మేరకు విద్యార్థి ఇంటి నుంచి కిలోమీటర్ దూరంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో సీట్ల పొందేందుకు మొదట అవకాశం కల్పిస్తారు. మిగిలిన సీట్లను 3 కిలోమీటర్ల దూరంలోని వారికి కేటాయిస్తారు. ఈ నిబంధనలను సడలించి అర్హులందరికీ సీట్ల కేటాయింపు జరగకుంటే ఎక్కువగా పట్టణ ప్రాంతానికి చెందిన వారే సీట్ల పొందే అవకాశాలు ఉన్నాయి.ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని పలువురు విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

15న ముగియనున్న దరఖాస్తుల ప్రక్రియ

2025-26 సంవత్సరానికి ఉచిత సీట్లపై రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. సీబీఎస్ఈ, ఐబీ, స్టేట్ సిలబస్,ఐసీఎస్ఈలు బోధిస్తున్న ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. దీని ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం ఉచిత విద్యను పొందడానికి ఈ నెల 15న దరఖాస్తుల ప్రక్రియ ముగియనుంది. దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 28న ప్రారంభమైంది. ప్రభుత్వ వెబ్‌సైట్‌తోపాటు వార్డు/ గ్రామ, మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తులను మే 16 నుంచి 20వ తేదీ వరకూ పరిశీలించి గ్రామ/వార్డు సచివాలయాల డేటా అధారంగా మ్యాపింగ్ చేసి పాఠశాలలకు పంపుతారు. అనంతరం మే 21 నుంచి 24 వ తేదీ వరకూ లాటరీ ద్వారా మొదటి దశలో సీట్లను కేటాయిస్తారు. సీట్లు నిండకపోతే జూన్ 6 నుంచి రెండో దశలో దరఖాస్తుల ప్రక్రియ నిర్వహిస్తారు.

పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను పొందడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 28 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మీ సేవ, గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అర్హులైన పేద విద్యార్థులందరు దరఖాస్తు చేసుకోవాలి.

– నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

25 శాతం సీట్లు ఇవ్వాలి



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఖచ్చితంగా ఇవ్వాలి, ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లను చేర్పించడానికి దరఖాస్తు చేసుకోవాలి. విద్యాహక్కు చట్టంపై అవగాహన లేకపోవడం వల్ల పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించాలి.

–శంకర్, ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సమితి కన్వీనర్

ఎస్సీ రైతులకు న్యాయం చేయండి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రైతులు

శింగనమల: ఎస్సీ రైతులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, రైతులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న, లోలూరు కుళ్లాయప్ప మాట్లాడుతూ మండలంలోని నిదనవాడ గ్రామంలో 1999లో 15 మంది ఎస్సీ రైతులకు సర్వే నంబర్ 213, 214లో ఒక్కొక్కరికీ రెండు ఎకరాలు చొప్పున అప్పటి ప్రభుత్వం డీఫారం పట్టా మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ, బ్యాంక్ రుణాలు పొంది జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం రీ సర్వే పేరుతో సర్వే నంబర్లు మార్పు చేశారని, ఆ భూమిని మిగులు భూములుగా అధికారులు చూపించారన్నారు. ఈ భూమిని సర్వే చేయించి సబ్ డివిజన్ ద్వారా ఎస్సీ రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, రమేష్ , రైతులు మునీంద్ర, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట



మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి

గుత్తి: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి అన్నారు. గుత్తిలోని సునామ జకినీ మాత ఆలయంలోని ఫంక్షన్ హాల్లో మంగళవారం గుత్తి డివిజన్ విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యల పరిష్కారం కొరకు ఉద్యమాలు చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళతామన్నారు. అనంతరం 327 యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా లక్ష్మీకాంత రెడ్డి, సెక్రటరీగా శేషహోలీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజునాథ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటరామిరెడ్డి, కోశాధికారిగా రామాంజనేయులు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

గుత్తి: గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతో పాటు ఐటీఐ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశాడు. గుత్తిలో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 15న విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గుత్తికి వస్తున్నారని, ఆరోజు జరిగే బహిరంగ సభలో డిగ్రీ, ఐటీఐ కాలేజీలు ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలన్నారు. అలా చేయకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు బాలాజీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



వీధి నాటకం ప్రదర్శిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కసాపురం రోడ్, మార్కెట్ తదితర ఏరియాల్లో తరిమెల రాజు కళా బృందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అపోహలు వీడి, అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రగతి మైత్రి మహిళా సంఘం అధ్యక్షురాలు కమల, ప్రాజెక్టు మేనేజర్ రమేష్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ వెంకటనారాయణతో అధ్యాపకులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ రిటైర్ట్ అయిన సంగతి తెలిసిందే. అనంతపురం ఓల్డ్‌టౌన్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రమోషన్‌పై తాడిపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు అధ్యాపకులు స్వాగతం పలుకుతూ శాలువాలు పూలహారాలతో సత్కరించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



గన్నెవారిపల్లి పంచాయతీ సచివాలయం-1 వద్ద మహిళలతో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజ నాయుడు

తాడిపత్రి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజ నాయుడు సూచించారు. తాడిపత్రి మండలంలో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గన్నెవారిపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయం 1, 2లను పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజలతో సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ఆరాతీశారు. సచివాలయం వద్దకు వచ్చిన మహిళలను మీ గ్రామ పంచాయతీలో పరిశుభ్రత ఎలా ఉందని ప్రశ్నించారు? చెత్తను తీసుకువచ్చేందుకు ఎవరూ రావడం లేదని, ఊరి వెలుపల కంప చెట్లలో పారబోస్తున్నామని వారు తెలిపారు. దీంతో గన్నెవారిపల్లి పంచాయతీ సెక్రటరీ రామకృష్ణను విషయంపై ఆరా తీయగా, ట్రాక్టర్ రిపేర్‌లో ఉందని సమాధానం ఇచ్చారు. అనంతరం చల్లవారిపల్లి పంచాయతీ, గన్నెవారిపల్లి పంచాయతీలలోని ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి వర్మి కంపోస్ట్ తయారీని పరిశీలించారు. గ్రామ పంచాయతీలలోని అన్ని ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాల్లో వర్మి కంపోస్ట్‌ను తయారు చేయాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వర్మి కంపోస్ట్‌ను విక్రయించడం వంటి అంశాలతో పాటు పన్ను వసూళ్లపై చర్చించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ చౌదరి, రావివెంకటాంపల్లి పంచాయతీ సెక్రటరీ విజయ్‌చంద్ర, గన్నెవారిపల్లి సచివాలయం 3 పంచాయతీ సెక్రటరీ రాజేష్, చల్లవారిపల్లి పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గాలీవానకు నిమ్మ రైతులకు నష్టం

యాడికి: మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజామున గాలీవానకు నిమ్మ చెట్లు నేలవాలాయి. మండల కేంద్రం నుంచి చందనకు రహదారిలో యాడికి గ్రామానికి చెందిన రైతులు గొడ్డుమర్రి బయన్న, రమేష్ మూడుఎకరాల్లో సాగు చేసిన నిమ్మ చెట్లలో 35 చెట్లు విరిగిపోయాయి. సమాచారం అందుకున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు దెమ్మతిన్న నిమ్మ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకటరమణ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫి మాట్లాడుతూ అకాల వర్షంతో నిమ్మ చెట్లు నేలమట్టం కావడంతో రైతులకు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. వారికి ప్రభుత్వం పరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణయాదవ్, నాయకులు రాముడు, కుళ్లాయిరెడ్డి, వెంకటస్వామి, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

గుత్తి: గుత్తిలోని మన్రో సత్రం సమీపంలో ఉన్న హజరత్ బందే నవాజ్ దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు రషీద్ మంగళవారం తెలిపారు. 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని ఉరుసు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ప్రైవేట్ స్కూల్ టీచర్ల ఇంట్లో చోరీ



టీచర్ శాంతి ఇంట్లో వస్తువులను చిందర వందరగా వేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని క్రిష్ణాపురం 3వ రోడ్డు, 7వ రోడ్డులో నివాసమున్న ఇద్దరు ప్రైవేట్ స్కూల్ టీచర్ల ఇళ్లల్లో చోరి జరిగింది. దాదాపు నాలుగున్నర తులాల బంగారు నగలు, రూ. 80 వేలు నగదు, వెండి గొలుసులు దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. క్రిష్ణాపురం 7వ రోడ్డులో నివాసమున్న ప్రైవేట్ స్కూల్ టీచర్ రాజేశ్వరి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల క్రితం బెంగళూరులో ఉన్న కూతురును చూడటానికి వెళ్లింది. సోమవారం ఇంటికి చేరుకున్న ఆమె దొంగలు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు నగలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే క్రిష్ణాపురం 3రోడ్డులో నివాసమున్న ప్రైవేట్ స్కూల్ టీచర్ శాంతి ఇంట్లో కూడా సోమవారం రాత్రి దొంగలు పడి దాదాపు రూ.80 వేల నగదు, 3 గ్రాములు బంగారు కమ్మలు, ముక్కుపుడకతోపాటు వెండి గొలుసులు దోచుకెళ్లారు. ఈనెల 6న ఆమె ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మధురైకి తీర్థయాత్రలకు వెళ్లారు. మంగళవారం ఉదయం ఆమె ఇంటికి రాగా.. తలుపులు తెరిచి ఉండటం గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులకొట్టి నగదు, బంగారు, వెండి ఆభరణాలు దోచికెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వృద్ధురాలి గొలుసు మాయం



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఓ వృద్ధురాలి బంగారు గొలుసు మాయమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తాడిమర్రి మండలం కునుగుంట్ల గ్రామానికి చెందిన రత్నమ్మ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి పార్నపల్లికి ఆర్టీసీ బస్సు ఎక్కింది. బీకేఎస్‌లోని ముసలమ్మ కట్ట వద్దకు బస్సు రాగానే మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసు కనిపించక పోవడంతో.. విషయాన్ని వృద్ధురాలు కండెక్టర్‌కు చెప్పగా డ్రైవర్ బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ పోలీసులు బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేయగా గొలుసు దొరకలేదు. అయితే తాడిపత్రి బస్టాండ్‌లో ముగ్గురు వ్యక్తులు బస్సులోంచి దిగినట్లు ప్రయాణికులు పోలీసులకు తెలిపారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లకు ఏటా రూ.15వేలు చెల్లించాలి



గుత్తిలో నిరసనలో పాల్గొన్న జీపు డ్రైవర్లు

గుత్తి/యాడికి: వాహనాల డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ అన్వర్‌బాషా మండిపడ్డారు. సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ చేపట్టిన జోడో యాత్ర మంగళవారం గుత్తి, యాడికిలో కొనసాగింది. గుత్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జీపు స్టాండ్ వద్ద, యాడికిలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సమావేశంలో అన్వర్ బాషా మాట్లాడారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలని, యాక్సిడెంట్‌లో మరణిస్తే రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని, బీమా వర్తింపజేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ. 15 వేలు చెల్లింపు మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా డ్రైవర్లను ఏకం చేసి, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు జోడో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టులో గుత్తిలో డ్రైవర్ల జాతీయ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో గుత్తి సేఫ్టీ డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్, కార్యదర్శి బాషా, ఉపాధ్యక్షుడు కిరణ్, యాడికిలో రాయలసీమ ఇన్‌చార్జ్ రామకృష్ణ యాదవ్, రసూల్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ అరికట్టారు



పైప్‌లైన్ లీకేజీని అరికట్టిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: మండలంలోని గార్లదిన్నెలో తాగునీటి పైపులైను లీకేజీ కారణంగా రోడ్డుపై నీరు నిలబడడంతో వాహచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని మంగళవారం లీకేజీని అరికట్టరూ సారు అంటూ సాక్షి ప్రతికలో వార్త వెలువడింది. గ్రామస్తులే స్వయంగా లీకేజీని మంగళవారం అరికట్టి సమస్యను పరిష్కరించడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'వైఎస్సార్‌సీపీ నాయకులపై నిందలు సరికాదు'

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్ముంపల్లిలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చిన్నసుబ్బయ్య కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటనపై టీడీపీ నాయకులు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడూరు సూర్యనారాయణ రెడ్డి, ఎద్దుల శరభారెడ్డి పై నిందలు వేస్తూ మాట్లాడారు. మంగళవారం కొన్ని పత్రికల్లో వచ్చిన కథనంపై బాధిత రైతు చిన్నసుబ్బయ్య స్పందించారు. జరిగిన ఘటనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సంబంధం లేదని, ఆ సమయంలో వారు దగ్గరుండి మంటలు ఆర్పారన్నారు. అలాంటి వారిని నిందించడం సమంజసం కాదన్నారు. తమకు వైఎస్సార్‌సీపీ వారిపై ఎలాంటి అనుమానం లేదన్నారు. తమను రాజకీయాల్లోకి లాగవద్దన్నారు.

నెట్టికంటుడికి కిలో వెండి వితరణ



ఆలయ సిబ్బందికి వెండి గిన్నెలు అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామానికి చెందిన కే.రామాంజనేయులు, పార్వతి దంపతులు మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి కిలో వెండితో తయారు చేయించిన రెండు గిన్నెలు, రెండు గరిటలను వితరణచేశారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని కసాపురం రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 19 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ.8.75 లక్షల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుత్తి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు తిమ్మన్న చౌదరి, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, పత్తి హిమబిందు, ఆంజి, తలారి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

24న మోడల్ డీఎస్సీ పరీక్ష

గుంతకల్లుటౌన్: ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 24న శ్రీశైల భ్రమరాంభిక డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జయరామ్ తెలిపారు. మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మోడల్ డీఎస్సీ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి రాయల్ రంగా తెలిపారు. వివరాలకు 9885262354 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పామిడి: పట్టణంలోని బైపాస్ హనుమాన్ లింకురోడ్డు ఏరియాలో ఉన్న ఎల్లమ్మ గుడి ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అధిక లోడ్ వల్ల తరుచూ ఈ ప్రాంతంలో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడేది. భక్తుల విజ్ఞప్తి మేరకు ఏపీఎస్ పీడీసీఎల్ ఏఈ మధుసూదన్‌రావు స్పందించారు. భక్తుల సౌకర్యార్థం నూతనంగా 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయాన్ని అధిగమింపజేశారు. ఇందుకు ఏఈకి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.